తగ్గిన ఖరీఫ్ సాగు

- కల్తీలను అరికట్టడంలో వ్యవసాయ శాఖ విఫలం
- నేటికి అందని అన్నదాత సుఖీభవ
- ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు అందిస్తారా..?

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

వ్యవసాయ రంగం కుదేలవుతున్నా వ్యవసాయాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించి సాగు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన వ్యవసాయ శాఖ నిద్రమత్తు వడలటంలేదు. లైసెన్స్ రెన్యూవల్ పైన ఉన్న శ్రద్ధ రైతాంగంపై లేదని రైతులు, రైతు సంఘాల నాయకులు చర్చిస్తున్నారు. ఖరీఫ్ సాదారణ సాగు 1056350 ఎకరాలు, గతేడాది జూన్‌లో 126827.5 ఎకరాలు, ఈ ఏడాది ఇప్పటికి 99770 ఎకరాలు మాత్రమే. దాదాపు 27057.ఎకరాలలో సాగు తగ్గింది. గతేడాదితో పోలిస్తే నైరుతి రుతుపవనాలు త్వరగా వచ్చాయి. గతేడాదితో పోలిస్తే 12 శాతం అధిక వర్షపాతం నమోదయింది. కానీ సాగు మాత్రం తగ్గడం విశేషం. రైతులకు అవగాహన కల్పించి ఎప్పుడు ఎలాంటి పంటలు వేయాలి. విత్తన నాణ్యత, తగినంత ఎరువులను ఏర్పాటు చేయడంతో వ్యవసాయ శాఖ పూర్తిగా విఫలమైందనే అపోహలున్నాయి. పత్తి గతేడాది 89 825 ఎకరాలు, ఈ ఏడాది 81925 ఎకరాలు, వేరుశనగ 1128, ఈ ఏడాది 4282.5 ఎకరాలు ,కంది 11910,ఈ ఏడాది 4122.5 ఎకరాలు, ఆముదం 2987.5 ఎకారలు, ఈ ఏడాది1355 ఎకరాలు, మొక్కజొన్న 3360 ఎకరాలు, ఈ ఏడాది 2200 ఎకరాలు ఇలా ప్రధాన పంటలు తగ్గాయి. మొత్తం జూన్ మాసానికి పెరగాల్సిన సాగు తగ్గింది.

కల్తీలను అరికట్టడంలో వ్యవసాయ శాఖ విఫలం

జిల్లాలో ప్రధాన పంటల్లో కల్తీ పెరగడం రైతులకు తీవ్ర నష్టాలను తెచ్చిపెట్టింది. సరైన సమయానికి నాణ్యమైన విత్తనాలు మార్కెట్‌లో లేకపోవడం పెట్టుబడికి లేక తక్కువ ధరలో నాసిరకం విత్తనం దొరకడం రైతుల పాలిట శాపంగా మారింది. జిల్లాలో పత్తి సాగు అత్యధికంగా ఉంటుంది. పత్తి విత్తనాల్లో నాణ్యత ప్రమాణాలు లేని ఎన్ని గుర్తింపు లేని ప్యాకెట్లు చెలామణి జరిగినట్లోనని రైతులు చర్చిస్తున్నారు. బీటీ-2 పత్తి విత్తనాలు 475 గ్రాములు (450 గ్రాములు బీటీ రకం, 25 గ్రాములు నాన్ బీటీ రకం) ప్యాకెట్ కనీస విక్రయ ధర (ఎమ్మార్పీ) రూ.863 నుంచి రూ.901లకు పెంచారు. ఒక్కో ప్యాకెట్ పైన రూ.38 పెరగడంతో ఉమ్మడి జిల్లా రైతుల పై రూ.11.50 కోట్ల వరకు అదనపు భారం తప్పలేదు. మరో పక్క నాసిరకం విత్తనాలు సమస్య వెంటాడింది. అధికారుల తనిఖీలు నామ మాత్రంగానే చేశారనే విమర్శలున్నాయి. కనీసం వ్యవసాయ అధికారులు ఒక్క కల్తీని కూడా గుర్తించలేని నిద్రావస్థలో ఉండటం రైతుల పాలిట ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారో ఉన్నతాధికారులు పరిశీలించాలి. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం ఇప్పటికి 81975 ఎకరాలలో పత్తి సాగయింది. కానీ క్షేత్ర స్థాయిలో ఇంతకు మించి పత్తి సాగు చేసుకున్నారు. పత్తి విత్తనాల్లో కల్తీని గుర్తించడం, వేరుశనగ అందించడంలో, జీలుగ, పిల్లిపెసర అందించడంలో వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంగా ఉందనే విమర్శలున్నాయి. ఇప్పటికే సాగయి మొలకెత్తిన పంటలకు ఈ క్రాప్ బుకింగ్ కూడా చేయలేని పరిస్థితుల్లో అధికార యంత్రాంగం ఉందని, ఆర్‌బికెలలో ఎలాంటి సలహాలు, సూచనలు ఇచ్చేవారు లేరని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేటికి అందని అన్నదాత సుఖీభవ

రైతుకు పెట్టుబడి సహకారం కింద కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ ఖరీఫ్‌సాగు మొదలైన అందకపోవడం వలన రైతులు వడ్డీ వ్యాపారుల ను ఆశ్రయిస్తున్నారు. ఖరీఫ్‌కు ముందు పెట్టుబడి సహాయం అందితే కనీసం విత్తన కొనుగోలుకు వచ్చేవి. సాగు భారం కానుందని వాపోతున్నారు. ఇప్పటికైనా త్వరగా అన్నదాత సుఖీభవ అందించాలని కోరారు.

ఖరీఫ్‌లోనైనా ఎరువులను అందిస్తారా..?

జిల్లాలో రైతుల సాగు చేసుకునే పంటలకు సకాలంలో ఎరువులను అందించాలని రైతన్నలు కోరుతున్నారు. రబీలో యూరియా కొరతవల్ల రైతులు పంటలు చాలా నష్టపోయారని అధికారుల నిర్లక్ష్యంగా ఉండటం వల్ల తమ పంటలు దిగుబడులు కోల్పోయామని ఆవేదన చెందారు. కనీసం ఈ ఖరీఫ్ లో అయినా సకాలంలో ఎరువులు అందించేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయ అధికారులు సకాలంలో స్పందించరు

- మునెప్ప, రైతు

ఖరీఫ్ సాగు మొదలు పెట్టి మొలకలు కూడా వచ్చాయి. నేటికి వ్యవసాయ అధికారులు ఎలాంటి విత్తనాన్ని తీసుకోవాలి. వాటికి ఎలాంటి మందులు వాడాలి. తెలుగుళ్ల ఎలా ఎదుర్కోవాలి అనే సలహాలు ఇవ్వలేని పరిస్థితి లో ఉన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్

ఎమర్జెన్సీ కంటే మతోన్మాదం ప్రమాదకరం

- పేరుకే ప్రజాతంత్ర హక్కులు
- ఎమర్జెనీ నాడు-నేడు సదస్సులో ఎంఏ.గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మోడీ ప్రభుత్వ మతోన్మాదం ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కంటే ప్రమాదకరమని సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ పిలుపునిచ్చారు. ఎమర్జెన్సీకి 50 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా కర్నూలు కార్మిక కర్షక భవన్ లో సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్ అధ్యక్షతన బుధవారం ఎమర్జెన్సీ నాడు-నేడు అంశంపై జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎ గఫూర్ మాట్లాడుతూ నాటి ఎమర్జెన్సీ సమయంలో తనతో పాటు అనేకమంది నిర్బంధాన్ని ఎదుర్కొన్నార న్నారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన వాళ్లను ప్రజలు సహించరనేది ఎమర్జెన్సీ ద్వారా నిరూపితమైందని తెలిపారు. నేడు మతం పేరుతో దాడులు, హత్యలు జరుగుతున్నాయన్నారు. ఇందిరాగాంధీ కంటే ఘోరంగా బిజెపి చేస్తోందని, ప్రజల్లో వ్యతిరేకత రాకుండా మతోన్మాదాన్ని పెంచుతోందని, మత రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని చూస్తోందని చెప్పారు. మతోన్మాదం అనే మహా ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలో ప్రజలను చైతన్య పర్చాలన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు కుట్ర సాగుతోందని, ఈ ప్రమాదాన్ని ఎదుర్కొని పోరాడాలని సందేశాన్ని ప్రజలకు ఇవ్వాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో దేశాన్ని బంధికానాగా మార్చారని, హక్కులను కాలరాశారని తెలిపారు. ఈరోజు ఎమర్జెన్సీకి ఏమాత్రం తీసుపోని విధంగా అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తున్నారని తెలిపారు. మోడీ పాలనలో పౌరులు హక్కులన్నీ కోల్పోతున్నారన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా గొంతు విప్పిన వారందరూ హత్య చేయబడ్డారని, అనేకమంది జైల్లో మగ్గుతున్నారని తెలిపారు. బిజెపికి అనుకూలంగా ఉంటే ఎన్ని నేరాలు చేసిన బయటే ఉంచుతున్నారన్నారు. ఇది నియంతృత్వం కాదా అని ప్రశ్నించారు. ఒకే భాష, ఒకే మతం, ఒకేదేశం, ఒకే ఎన్నిక అని రాష్ట్రాలకు ఉండే హక్కులను హరించేశారన్నారు. బిజెపి పాలిత ప్రాంతాల్లో మహిళల మీద, మైనార్టీల మీద, దళితుల మీద దాడులు పెరిగాయన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపేవారి ఆస్తులను ధ్వంసం చేసే బుల్డోజర్ రాజ్యం వచ్చిందన్నారు. ఎమర్జెన్సీ కంటే మోడీ పాలన ప్రమాదకరమన్నారు. బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల, రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు అందరు కృషి చేయాలన్నారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా జులై 9న చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మెలో అందరూ చురుగ్గా పాల్గొనాలన్నారు. మతోన్మాద వ్యతిరేక పోరాటంలో ముందు వరుసలో ఉండాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ అప్పటి ఎమర్జెన్సీ ద్వారా భారత ప్రజల హక్కులను నిర్వీర్యం చేశారని, 2014 నుంచి 11 సంవత్సరాలుగా అప్రకటిత నిర్బంధం సాగుతోందని తెలిపారు. నాటికంటే నేటి అప్రకటిత ఎమర్జెన్సీ ప్రమాదకరమన్నారు. ఎమర్జెన్సీ సమయంలో కర్నూలు జిల్లాలో గఫూర్ తో పాటు పలువురు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుతం బిజెపిని వ్యతిరేకించి ఏ ఒక్కరిని వదలకుండా నిర్బంధాలు ప్రదర్శిస్తున్నారన్నారు. ఈనెల 30న చట్ట సవరణకు వ్యతిరేకంగా కర్నూలు ఎస్టీ బీసీ కళాశాల మైదానంలో నిర్వహించే సభలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని, మైనార్టీలను మేధావులను కదిలించాలని కోరారు.

ప్రస్తుత పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు గేయాలు

సదస్సుకు ముందు ప్రజానాట్యమండలి కళాకారులు ప్రస్తుత పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు గేయాలను ఆలపించి వినిపించారు. అందులో 'ఏమవుతుందో నా దేశం ఎటు పోతుందో మన భారతదేశం', విశ్వశాంతి చిహ్నమా! ప్రజా హృదయ రూపమా!"నేడు కురిసిన హిమ సముద్రమా, ఎక్కడమ్మా!' జారుతున్న కన్నీరు, ఎన్నో కష్టాల హూరూ,' ఎప్పుడైనా యోచించావా !ప్రగతి నీవు సాధించావా' అగ్రరాజ్య పీఠమా! అమెరికా సామ్రాజ్యవాదమా! అంటూ గేయాలాపనలు చేసి సభకు ఆహుతులైన వారందరిని ఆలోచింప చేశారు. గేయాలాపనలో ప్రజానాట్యమండలి కళాకారులు బసవరాజు, రాజు, లోకేష్, నాగ సుంకన్న, బతుకన్నలు పాల్గొన్నారు.

సదస్సుకు హాజరయిన నాయకులు, ప్రజలు

బాలల సంరక్షణ సంస్థలకు సిఫార్సులు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో అర్హత కలిగిన ఆరు బాలల సంరక్షణ సంస్థలను నిర్వహించేందుకు సిఫార్సు చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా అనుమతులు జారీ చేశారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బాలల సంరక్షణ సంస్థల జిల్లా స్థాయి సిఫార్సుల కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జువెనైల్ జస్టిస్ చట్టం 2015 ప్రకారం అర్హత కలిగిన బాలల సంరక్షణ సంస్థలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు జిల్లా స్థాయి సిఫార్సుల కమిటీ ఆధ్వర్యంలో తనిఖీ చేసి సిఫార్సులు చేస్తామన్నారు. ఆ మేరకు జిల్లాలో ప్రభుత్వం, ఎన్‌జిఒల ద్వారా నడిపిస్తున్న తొమ్మిది బాలల సంరక్షణ సంస్థలు దరఖాస్తు చేసుకోగా, నిర్దేశించిన ప్రమాణాల మేరకు వాటిలో ఉన్న వసతులను పరిశీలించడం జరిగిందన్నారు.. ఇందులో 6 సంస్థలు అర్హత కలిగినవిగా సిఫార్సు చేశామని కలెక్టర్ తెలిపారు. జువెనైల్ అబ్జర్వేషన్ హోమ్, శిశుగృహాల నిర్వహణ గురించి కలెక్టర్ ఐసిడిఎస్ పీడీని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఇబ్బంది కలగకుండా బాలల సంరక్షణ సంస్థలను సక్రమంగా నడపాలని కలెక్టర్ సూచించారు. అదనపు ఎస్‌పి హుస్సేన్ పీరా, జువెనైల్ శాఖ జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ దివాకర్, ఐసిడిఎస్ పిడి నిర్మల, సిడబ్ల్యుసి చైర్మన్ జుబేదా బేగం, డిసిపిఒ శారద, జువెనైల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ సునీత, అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

ట్రాఫిక్ నియంత్రణకు 22 ద్విచక్ర వాహనాలు

-జెండా ఊపి ప్రారంభించిన ఎస్‌పి విక్రాంత్ పాటిల్ -ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ట్రాఫిక్ నియంత్రణ కోసం అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన 2 - బుల్లెట్ వాహనాలు, 20-అపాచి వాహనాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్ బుధవారం ప్రారంభించారు. ఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ఆఫీసు మంగళగిరి నుండి వచ్చిన ఈ వాహనాలను సైరన్, బ్లింకర్స్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, క్రౌడ్ కంట్రోల్ చేయడానికి అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించారన్నారు. జిల్లాలోని కర్నూలు ట్రాఫిక్ పిఎస్‌కు, ఎమ్మిగనూరు ట్రాఫిక్ పిఎస్‌కు , ఆదోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్లకు ఈ వాహనాలు కేటాయిస్తున్నామన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెరగడంతో ప్రజలు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారని భావిస్తున్నామన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడినప్పుడు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎక్కడైనా ఫోర్ వీలర్ వెళ్ళలేని ప్రాంతాలలో టూ వీలర్స్ వెళ్ళి అక్కడ ట్రాఫిక్ సమస్యను తగ్గించి, ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో పని చేస్తాయన్నారు. ప్రజల చేతిలో కర్నూలు ట్రాఫిక్ అనే వాట్సాప్ నెంబర్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఎక్కడైనా ఓవర్ లోడింగ్, రాంగ్ రూట్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినట్లయితే వారి ఫోటోలను తీసి ఆ వాట్సాప్ నెంబర్‌కు పంపిస్తే అటువంటి వారిని ట్రాఫిక్ పిఎస్‌లకు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇవ్వడం, జరిమానా విధించడం జరుగుతుందన్నారు. అనంతరం డివిఆర్ గ్రూప్స్ అధినేత డి.వెంకటేశ్వర రెడ్డి జిల్లా పోలీసు శాఖకు డిజె డ్రోన్ కెమెరాను అందజేశారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్, డిఎస్‌పిలు బాబు ప్రసాద్, భాస్కర్‌రావు, ప్రసాద్, సిఐలు తేజమూర్తి, మన్సురుద్దీన్, అబ్దుల్ గౌస్, నాగరాజారావు, రామానాయుడు, ఆర్ఐలు నారాయణ, జావేద్, సోమశేఖర్ నాయక్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ హుస్సేన్, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ,మెడికవర్ వైద్యులు

సిపిఆర్ పై జిల్లా పోలీసులకు శిక్షణ

-ప్రారంభించిన ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సిపిఆర్, ప్రథమ చికిత్సపై జిల్లా పోలీసులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో ముందుండే జిల్లా పోలీసు సిబ్బందికి సిపిఆర్ ప్రథమచికిత్స పై అవగాహన కల్పించారు. ఏమి చేయాలి, ఏమి చేయకూడదో తెలియజేశారు. ఎస్‌పి మాట్లాడుతూ... గుండెపోటు వచ్చినప్పుడు, స్పృహ కోల్పోయినప్పుడు, హాస్పిటల్ కు తీసుకువెళ్ళే 1 గంట లోపు చేసే సిపిఆర్ విధానంపై జిల్లా పోలీసులకు శిక్షణ , అవగాహన కల్పించడంతో పాటు పోలీసులచే ప్రాక్టీస్ చేయిస్తున్నామన్నారు. మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ సునీల్ యాదవ్ మాట్లాడుతూ...ప్రతి ఇంట్లో సిపిఆర్ పై అవగాహన ఉండడం ముఖ్యమన్నారు. ఏ సమయంలో నైనా ఉపయోగపడ వచ్చన్నారు. ప్రతి కుటుంబ సభ్యులకు తెలపాలన్నారు.పోలీసులకు సిపిఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్), ప్రథమ చికిత్స పై అవగాహన కల్పించడం ముఖ్యమన్నారు. ఎందుకంటే వారు అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సహాయం చేయడంలో మొదటి ప్రతిస్పందనదారులుగా ఉంటారన్నారు. సిపిఆర్, ప్రథమ చికిత్స నైపుణ్యాలు కలిగి ఉండటం వలన, ప్రమాదాలు జరిగినప్పుడు లేదా గుండెపోటు వచ్చినప్పుడు వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రూ. 8 వేల విలువ గల హెల్త్ చెకప్ మెడికల్ కూపన్స్ పోలీసులకు ఉచితంగా అందజేశారు. పోలీసుల కుటుంబ సభ్యులకు రూ. 8 వేల విలువ గల హెల్త్ చెకప్ మెడికల్ కూపన్స్‌ను రూ.1000 లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్, మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ సునీల్ యాదవ్, పోలీసు వేల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, డిఎస్‌పిలు బాబు ప్రసాద్, భాస్కర్ రావు, ప్రసాద్, సిఐలు తేజమూర్తి, మన్సురుద్దీన్, అబ్దుల్ గౌస్, నాగరాజారావు, రామానాయుడు, ఆర్ఐలు నారాయణ, జావేద్, సోమశేఖర్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-సి బెళగల్



సి బెళగల్ మండలం యనగండ్ల, గుండ్రేవులలో ఎఒ మల్లేష్ కుమార్ బుధవారం రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ విత్తనాలు చల్లడం వలన భూమిలో పోటాషియం, నత్రజని, బాస్వరం వంటివి పోషకాలు ఉత్పత్తి అవుతాయని రైతులకు తెలిపారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకొని పంటలు సాగు చేసుకోవాలని పేర్కొన్నారు. అంతేకాకుండా మండలంలో పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా 10229 మందికి రూ.20 వేలు ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందన్నారు.

ఆటో కార్మికుల హక్కుల సాధనకు పోరాటం

-సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ పిలుపు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ఏపీ ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ మూడవ మహాసభ ఆటో యూనియన్ నగర అధ్యక్షులు జె.రవికుమార్ అధ్యక్షతన కర్నూలు అంబేద్కర్ భవన్‌లో అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఆర్‌టిఒ భరత్ చౌహాన్, ఎంవిఐ రవీంద్ర కుమార్, ట్రాఫిక్ సిఐ మనసురుద్దీన్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ హాజరయ్యారు. ప్రారంభ సభలో అధికారులు మాట్లాడుతూ వారు ఆటో కార్మికులు క్రమశిక్షణతో మెలగాలని, ఆటో డ్రైవింగ్ చేసేటప్పుడు లైసెన్స్‌కు సంబంధించిన రికార్డ్స్‌ను ఆటో లోనే ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ను సక్రమంగా పాటించాలని, మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదని, 7 సెంటర్లో సిసి కెమెరాలు ఆటోమేటిక్‌గా ఫైన్ లు వేస్తాయన్నారు. ఆటో కార్మికులు జాగ్రత్తగా పద్ధతి ప్రకారం డ్రైవింగ్ చేయాలని తెలిపారు, కిమ్స్ సిఇఒ సునీల్ కుమార్, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ జానకిరామయ్య మాట్లాడుతూ కిమ్స్ హాస్పిటల్ వారు ఆటో కార్మిక కుటుంబాలకు సబ్సిడీతో వైద్యం అందిస్తామని, ఆటో కార్మికులకు మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, వారు ఉప యోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ మహాసభ ప్రాంగణంలో ఉచితంగా టెస్టింగ్ లు చేస్తున్నామని అందరూ సద్వినియోగం చేసు కోవాలని తెలిపారు. ప్రతినిధుల సభలో ఆటో యూనియన్ నగర ప్రధాన కార్య దర్శి కార్యక్రమాల రిపోర్టు ప్రవేశపెట్టగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, సిఐటియు ఓల్డ్ సిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, విజయరామాంజనేయులు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శికె. ప్రభాకర్ పాల్గొన్నారు. పిఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఆటో కార్మికులు చాలా దుర్భరమైన పరిస్థితిలో జీవనాన్ని కొనసాగిస్తున్నారన్నారు. కర్నూలు నగరంలో పరిశ్రమలు లేకపోవడం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడం వలన చాలామంది డిగ్రీలు పూర్తి చేసుకున్న నిరుద్యోగులు ఆటోల ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఒక పక్కా పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచుతూ మరోపక్క ఆర్‌టిఎ చలానా రేట్లు, ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లు, చాలా రకాల ఫైన్లు వేస్తూ కార్మికుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు.మున్సిపల్ అధి కారులు ట్రాఫిక్ పోలీసులు రోడ్లను వెడల్పు చేయ కుండా, ఫ్లైఓవర్లు నిర్మించ మని ప్రభుత్వానికి చెప్పకుండా ఆటో కార్మికులను ఇబ్బంది పెట్టే రకంగా అడ్డాలను తొలగిస్తున్నారన్నారు. సైడు నిలబడిన ఆటోలకు ఫైన్లు వేస్తున్నా రన్నారు. ఆర్‌టిఒ ఆఫీస్ ప్రైవేటీకరిస్తూ ఎటిసి సెంటర్లను ఏర్పాటు చేయడం వలన ఆటో కార్మికుల పైన అధిక భారం పడుతుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ఆటో కార్మికుల కడుపు కొట్టడమేని తెలిపారు. సమస్యల పరి ష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ఐక్యమై పోరాటం చేయాలన్నారు. అనంతరం నూతన కమి టీని ఎన్నుకున్నారు. నూతన కమిటీగా నగర అధ్యక్షు లుగా డి.కుమార్, నగర ప్రధాన కార్యదర్శి మహమూద్, ఆఫీస్ బేరర్లుగా జె.రవికుమార్, త్యాగరాజు, వెంకటేష్, శీను, వెంకట్, బడేబాష మూర్తు జావలి, వంశీ, మధు, రామకృష్ణ, వెంగళరావు, రామద్దయ్య, జాషువా లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

అధ్యక్షులు డి.కుమార్ - కార్యదర్శి మహమూద్

అందని తాగునీరు

-శాపనార్థాలు పెడుతున్న మహిళలు-సబ్బు నీళ్ల లాగా నురుగు, బురద నీళ్లు

-స్నానం చేస్తే ఒళ్ళు దురదలు వస్తున్నాయి -వంటకు కూడా పనికిరావు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర నడిబొడ్డులో నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో కొత్తపేటలో తాగునీరు ఎప్పుడు వదులుతారో.. ఎంతసేపు వస్తాయో తెలియక గంటల తరబడి ఎదురు చూస్తున్నా..ఎవరూ పట్టించుకోవడం లేదంటూ స్థానిక మహిళలు శాపనార్థాలు పెడుతున్నారు. బుధవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం కొత్తపేట లో పర్యటించింది. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ తాగునీటి సమస్యపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రతినిధి బందానికి తెలిపారు. అప్పుడే వచ్చిన కొళాయి నీళ్లు నురుగు, మట్టి నీళ్లలాగా ఉన్నాయని బకెట్లో పట్టి కొందరు మహిళలు బృందం సభ్యులకు చూపెట్టారు. ఒక ఇంటికి నీళ్లు వస్తే నాలుగు ఇండ్లకు రావడం లేదంటూ స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కోసారి నీటి మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మహిళలు బేబీ, శరీన,స్వప్న, శమిన, ప్రేమ్ కుమార్, మాట్లాడుతూ సబ్బు నీళ్ల లాగా నురుగుతో బురద నీళు వస్తున్నాయని అన్నారు. వంట చేసుకోవడానికి కూడా పనికి రావడం లేదన్నారు. ఆ నీళ్లు కూడా ఎప్పుడొస్తాయో ఎంత సేపు వస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. స్నానం చేస్తే దురదలు వస్తున్నాయని ఒక వ్యక్తి తన ఒంటిపై వచ్చిన బొబ్బలను చూపెట్టాడు. కమిషనర్ పర్యటించి ఇంటి పన్నులు, కులాయి పన్నులు చెల్లి స్తున్న నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయ కులు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ పర్యట నలో ఎ.వెంకటేశ్వర్లు, ఎస్.రమణగౌడ్, మహ మ్మద్ యూనూస్, ఠాకూర్, భాస్కర్, అన్వర్‌బాష, రాజు, మాలిక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుపుతున్న మహిళలు

షరీన్‌నగర్‌లో ' టిబి ముక్త్ అభియాన్ '

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా టిబిముక్త్ అభియాన్ కార్యక్రమం షరీన్ నగర్ యుపిహెచ్‌సి పరిధి సవారీ తోట సచివాలయం 77 పరిధిలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వార్డు ఇన్చార్జి ఎస్‌కె శ్రీనివాసరావు , డాక్టర్ చంద్రకళ మాట్లాడుతూ ప్రతి వార్డులో రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు, బరువు తగ్గిపోవడం, 60 ఏళ్ళు పైబడిన వారు, పొగ తాగువారు, మద్యం సేవించు వారు, పౌస్తికాహార లోపం ఉన్న వారికి అందరికి టీబీ గళ్ళ పరీక్షలు, ఎక్షరేలు చేయించాలన్నారు. ఇందులో భాగంగా నిక్షయ్ శిబిరాలు ఏర్పాటు చేసి జన భగీదారిలో భాగంగా వార్డ్ లోని ప్రజలకు టీబీ గురించి తెలియచేసి, టీబీ వ్యాధి గురించి ఉన్న మానసిక రుగ్మతను తీసివేయాలన్నారు. వాటితో పాటు ఎవరైనా నిరుపేద టీబీ రోగులకు గ్రామ స్థాయిలో దాతల సహకారంతో ప్రతి నెల పౌష్టికాహారం అందజేయా లన్నారు. వైద్యాధికారి డాక్టర్ చంద్రకళ, సచివాలయం అడ్మిన్ భాస్కర్ రెడ్డి , వార్డ్ ఇంచార్జి ఎస్కే శ్రీనివాసరావు, పుల్లయ్య గౌడ్ , శ్రీనివా సులురెడ్డి, కుమ్మరి రామకృష్ణ, ఎ. రామకృష్ణ, అన్వర్, శివ, దను సూ పెర్వైసర్ ఇమ్రాన్ బాషా ,పద్మావతి మేల్ హెల్త్ అసిస్టెంట్ జె.కుమార్, ఆరోగ్య కార్యకర్త బి.కల్యాణి , ప్రమీల, కుమారి , ఆశ, డి. భారతి , జి భారతి పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించిన జడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

కోడుమూరు, పుల కుర్తి, ప్యాలకుర్తి గ్రామాల సంపద సష్టి కేంద్రాలను జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి బుధవారం పరిశీలించారు. పర్యటనలో భాగంగా గ్రామ వార్డు సచివాలయాలు సంద ర్శించి ఇంటింటి నుండి చెత్త సేకరణ అంశంలో కచ్చితంగా గ్రామాలు శుభ్రంగా ఉంచేటట్లు పంచాయతీ సెక్రెటరీలు, పారిశుధ్య సిబ్బంది బాధ్యతగా ఇంటింటి నుండి చెత్త సేకరణ చేయాలని ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయాల కార్యక్రమాలు ప్రగతి నివేదికలు కూడా సమీక్షించారు. అసంపూర్తిగా ఉన్న సర్వేలు అన్నింటిని నాలుగు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ గ్రామాల పాత్ర సంపద సృష్టించడం వర్మీ కంపోస్ట్ కుండీల నిర్మాణం పొడి చెత్త కుండీల నిర్మాణం, త్రి చక్ర వాహనాలు కావలసిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ కేంద్రాల ద్వారా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడడంతోపాటు వర్మీ కంపోస్ట్ ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు.ఎంపిడిఒ ఎసి రాముడు పాల్గొన్నారు.

'ఆర్‌ఎస్‌కె'కు అందని ఎరువులు

- యూరియా బస్తా కావాలంటే అదనపు మందు తీసుకోవాలి

- అధిక ధరలకు యూరియా విక్రయం

ప్రజాశక్తి- దేవనకొండ

ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో రైతు సేవా కేంద్రాలకు కాంప్లెక్స్ ఎరువులు యూరియా, డిఏపి రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దేవనకొండలోని ఫర్టిలైజర్ దుకాణదారులు యూరియా

ఓ దుకాణం వద్ద ఎగబడుతున్న రైతులు

బస్తా రైతులకు కావాలంటే అదనంగా మరో మందు లింకు పెడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. 45 కిలోల యూరియా బస్తా రూ.266 ఉండగా ఫర్టిలైజర్ దుకాణదారులు రూ.300లకు అమ్ముతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే వేరుశనగ, ఆముదం, పత్తి పంటలను అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారు. అదునులో ఎరువులు వేసుకోవాలని రైతులు ఫర్టిలైజర్స్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. సంబంధిత వ్యవసాయ అధికారులు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని, యూరియా బస్తాకు మరో మందు లింకు, అధిక ధరలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారి ఉషారాణిని వివరణ కోరగా... ఫర్టిలైజర్ దుకాణాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తహశీల్దార్ లేని కార్యాలయం

ప్రజాశక్తి - కోసిగి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గత 20 రోజుల నుంచి తహశీల్దార్ లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కోసిగికి రెగ్యులర్

తహశీల్దార్‌ను ప్రభుత్వం కేటాయించినా ఇంతవరకు బాధ్యతలు చేపట్టకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 26 గ్రామాలు ఉన్న మండలంలో ఇంతవరకు తహశీల్దార్ లేకపోవడంతో మండల ప్రజలు ఆగ్రహంతో పాటు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు, పొలం సమస్యలు, పాసు పుస్తకం సమస్యలు, రీసర్వే సమస్యలతో పాటు రోజూ కార్యాలయానికి వందలాది మంది ప్రజలు వస్తూ నిరాశతో తిరిగి వెళ్తున్నారు. గతంలో పనిచేసిన డిటి రుద్ర గౌడ్ బదిలీలో భాగంగా ఆదోని సివిల్ సప్లయికి వెళ్లారు. తర్వాత రెగ్యులర్ తహశీల్దార్‌ను ప్రభుత్వం కేటాయించింది. మంత్రాలయం తహశీల్దార్‌ను ఇన్‌ఛార్జీగా కేటాయించారు. ఇంతవరకు ఇన్‌ఛార్జీ లేరు.. రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో కార్యాలయం చుట్టూ ప్రజలు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. కలెక్టర్ స్పందించి మండలానికి రెగ్యులర్ తహశీల్దార్ వచ్చే విధంగా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మట్టెద్దుల అమావాస్య

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబలం, మండగిరి, జాలమంచి, పాండవగల్, కుప్పగల్, ఇస్వి తదితర గ్రామాల్లో బుధవారం మట్టెద్దుల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో జోడు మట్టెద్దులను తీసుకొచ్చి ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. మట్టెద్దుల అమావాస్య సందర్భంగా ఉదయం నుంచి ఆలయాల్లో జలాభిషేకం, కుంకుమార్చన, బిల్వార్చనలు చేపట్టారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- వైసిపి చేనేత విభాగం నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వైసిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు ఎంకె.శివ ప్రసాద్ డిమాండ్

సంఘీభావం తెలుపుతున్న నాయకులు

చేశారు. బుధవారం ఎమ్మిగనూరు మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు వైసిపి చేనేత విభాగం పూర్తి మద్దతు తెలిపింది. ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్ హాజరయి మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా తక్కువ జీతాలతో, ఉద్యోగ భద్రత లేకుండా పని చేస్తున్న దుస్థితిని ప్రభుత్వం గమనించాలని డిమాండ్ చేశారు. వైసిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు శివ ప్రసాద్ మాట్లాడుతూ... మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు అధిక శారీరక శ్రమతో, తక్కువ వేతనాలతో జీవిస్తున్నారని తెలిపారు. ఈ ఒక్కరోజు మధ్యాహ్నం భోజన వసతి కల్పించి దగ్గరుండి కార్మికులకు భోజనాలు వడ్డించారు. చేనేత విభాగం నియోజకవర్గ అధ్యక్షులు మీసాలబండ నీలకంఠ, వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, ప్రధాన కార్యదర్శి కరే రాము, నాయకులు చంద్రశేఖర్, సోమేష్, కడివెళ్ల ఉరుకుంద పాల్గొని సంఘీభావం తెలిపారు.

సుచి, శుభ్రత పాటించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఇఒ శామ్యూల్ పాల్

- 'విద్యార్థుల అర్ధాకలి'పై స్పందన

ప్రజాశక్తి - ఆదోని

మధ్యాహ్న భోజన నిర్వాహకులు సుచి, శుభ్రత పాటించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఇఒ శామ్యూల్ పాల్ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో రెండు రోజుల క్రితం చోటు చేసుకున్న 'విద్యార్థుల అర్ధాకలి' ఘటనపై అధికారులు స్పందించారు. బుధవారం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం రుచి చూసి అర్ధాకలి ఘటన పట్ల విద్యార్థులతో రహస్యంగా మాట్లాడారు. ఏజెన్సీ నిర్వాహకులు వండిన భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో

విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, డిఇఒ

సుచి, శుభ్రతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని వంట ఏజెన్సీ నిర్వాహకులు వడ్డించాలని సూచించారు. భోజనంపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి బడిలోనే మధ్యాహ్న భోజనం చేసేలా చూడాలని, ఇంటి నుంచి క్యారేజ్ తీసుకురాకుండా వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. గతం కంటే ఎక్కువ మంది బడిలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నట్లు తాము గుర్తించామన్నారు. స్టాక్ వివరాలు, విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, ఉపాధ్యాయులు నాగరాజ్, సునీల్ రాజ్ కుమార్, రమేష్ నాయుడు, మల్లికార్జున, చంద్ర, జగన్, ఏజెన్సీ నిర్వాహకులు భరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు ఉన్నారు.

వైకెపి కార్యాలయం ముందు

రైతు ఆత్మహత్యాయత్నం

- రుణం ఇప్పిస్తానని రూ.50 వేలు తీసుకున్న ఎపిఎం

ప్రజాశక్తి - మంత్రాలయం

కోసిగి మండలం వందగల్లు గ్రామానికి చెందిన రైతు బసవరాజు బుధవారం స్థానిక వైకెపి కార్యాలయం ముందు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి... ప్రస్తుతం వైకెపి ఎపిఎంగా పనిచేస్తున్న రాజశేఖర్ గతంలో కౌతాళం ఎపిఎంగా పని చేశారు. రాజశేఖర్, కౌతాళం మండలం తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన విలేజ్ బుక్ కీపర్ శ్రీరాములు ద్వారా బ్యాంకులో రుణం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి బసవరాజు నుంచి రూ.50 వేలు వసూలు చేశారు. 'అదిగో.. ఇదిగో...' అంటూ కాలయాపన చేస్తున్నారు. రుణం ఇప్పించకపోవడంతో విసుగు చెందిన బసవరాజు వెలుగు కార్యాలయం వద్ద ఎపిఎం రాజశేఖర్ ఎదురుగా పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే 108 ద్వారా ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రైతు కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు

మరోసారి ఇలా జరిగితే తొలగిస్తాం

- ఎండిఎం ఏజెన్సీని హెచ్చరించిన ఎంఇఒ జగన్నాథం

ప్రజాశక్తి - హొళగుంద

మరోసారి ఇలా జరిగితే నోటీసులు ఏమీ ఇవ్వకుండా తొలగిస్తామని ఎంఇఒ జగన్నాథం హెచ్చరించారు. ప్రజాశక్తిలో ప్రచురితమైన 'కుళ్లిన గుడ్లు.. నీళ్లచారు' కథనంపై డిఇఒ ఆదేశాల మేరకు ఎంఇఒ జగన్నాథం స్పందించారు. బుధవారం మండలంలోని వందవాగిలి గ్రామం కన్నడ పాఠశాల సందర్శించారు. విద్యార్థులకు కుళ్లిపోయిన గుడ్లు, అరకొర భోజనం ఎలా వడ్డిస్తారని మండిపడ్డారు. మార్పు రాకపోతే ఏజెన్సీని నోటీసులు ఏమీ ఇవ్వకుండా మారుస్తామని హెచ్చరించారు. భోజనశాల, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటించాలన్నారు. 'మీరెలా వంట ఏజెన్సీలకు సపోర్ట్ చేస్తారు. కుళ్లిన గుడ్లు, అరకొరకు భోజనాలు అందించినట్లు, కారం ఉప్పు వేసి గుడ్లను పక్కన పెట్టుకున్న ఫొటోలు మీకు కనపడలేదా' అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంబునాథ్‌ను ప్రశ్నించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేయాలని, బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీ, ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. సిఆర్‌ఎంటి ఎం.లక్ష్మప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ జగన్నాథం

ఫీజుల దోపిడీపై నిఘా ఉంచాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలపై నిఘా పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. బుధవారం ఆదోనికి వచ్చిన డిఇఒ శామ్యూల్ పాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమయిన వేళ పేద విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల పేరుతో ముక్కు పిండి వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నిఘా ఉంచి అక్రమాలకు

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాల్పడిన ప్రయివేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠ్యపుస్తకాలు, టై, బెల్ట్ పేరుతో వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆదోని డివిజన్ వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఆర్‌టిఇ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడం లేదన్నారు. పేద విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం జిఒలను పకడ్బందీగా అమలు చేసినప్పుడే సార్థకత ఉంటుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీమఠంలో శ్రీశిరూర్ మఠం పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని శిరూర్ మఠం పీఠాధిపతులు శ్రీవేద వర్ధన తీర్థులు దర్శించుకొన్నారు. బుధవారం కర్ణాటక రాష్ట్రం ఉడుపి అష్ట మఠాల్లో ఒకటైన శ్రీశిరూర్ మఠం పీఠాధిపతులు మంత్రాలయాన్ని సందర్శించారు. పండితులు ఆయనకు సాంప్రదాయ పద్ధతిలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మ ను, శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాష్ట్రపతి ప్రతిభ అవార్డు గ్రహీత, పండిత కేసరి, మహామహోపాధ్యాయ బిరుదాంకితులు శ్రీరాజా ఎస్.గిరియాచార్యులు ఆయనను శ్రీమఠం ఆనవాయితీలో సన్మానించారు. ఆయన కూడా రాజా ఎస్.గిరియాచార్యులకు శాలువా, పూలమాల వేసి సన్మానించారు.

ఉరుకుందలో లక్ష పుష్పార్చన

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం అమావాస్య నేపథ్యంలో భక్తుల సమక్షంలో లక్ష పుష్పార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు మురళీకృష్ణ శర్మ స్వామి వారికి జలాభిషేకం, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ముఖ్య అర్చకులు శివన్న స్వామి, నాగ రాజ్ స్వామి, ఈరన్న స్వామి పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - హొళగుంద

దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి దేవాలయంలో అమావాస్య నేపథ్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారి గిరి స్వామి, మనోహర్ స్వామి బుధవారం తెలిపారు. తెల్లవారు జాము నుంచే స్వామివారికి జలాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమార్చన, బండారు చందన అభిషేకంతో పాటు ఆకుపూజ నిర్వహించినట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీలో అలసత్వం వద్దు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రేషన్ కార్డు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేసే ప్రక్రియలో అలసత్వం ఉండకూడదని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 116 ఎఫ్‌పి షాపులు, 79,400 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. వీరికి ప్రభుత్వం నుంచి వస్తున్న రేషన్ సరుకులను సకాలంలో అందజేయాలన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. షాపు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుని, తాగునీటి సదుపాయం కల్పించాలని తెలిపారు. తూకాల్లో పొరపాటు జరిగితే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకేవైసికి సంబంధించి ఆదోని మండలం కేవలం 70 శాతం మాత్రమే పూర్తయిందని, నిర్ణీత గడువులోపు వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. 65 ఏళ్లు పైబడిన వారికి, వికలాంగులకు 1వ తేదీ కంటే ముందుగా 26 నుంచి 30వ తేదీ లోపలే రేషన్ సరుకులు డోర్ డెలివరీ చేయాలని సూచించారు. వారంలో 4, 5 రోజులు ఎఫ్‌పి షాపులను ఆకస్మిక తనిఖీ చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. తహశీల్దార్ రమేష్, పౌర సరఫరాల శాఖ ఉప తహశీల్దార్ రుద్రగౌడ్ పాల్గొన్నారు. **చిప్పగిరి** తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ సునీత ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యదర్శులు, చౌక దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ మాట్లాడారు. చౌక దుకాణాలను 1 నుంచి 15 వరకు ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో తెరిచి సరుకులు ఇవ్వాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, విఆర్‌ఒలు పెద్దన్న, గోవిందప్ప, ఆంజనేయులు, సునీత, సుభద్ర పాల్గొన్నారు. **నందవరం** రెవెన్యూ కార్యాలయంలో రేషన్ షాపు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడారు. **దేవనకొండ** తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రామాంజనేయులు సమావేశం నిర్వహించారు. నిర్లక్ష్యం వహించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదోనిలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

చిప్పగిరిలో మాట్లాడుతున్న తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

నందవరంలో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసులు

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL DISTRICT JUDGE :: KURNOOL AT ADONI.
I.A. No. 85/2024 in A.S. No. /2024.
Between:
Kummari Nagesh & others. ...Petitioners/Appellants.
AND
Vadde Parvathamma & others. ...Respondents.
NOTICE TO R-5 & R-6.
To
R-5. K. Eramma, W/o Late Kowthalam Chinna Ramaiah, Hindu, aged about 55 years, Agriculturist, R/o Goudagallu Vil., Kosigi Mandal, Kurnool Dist.
R-6. K. Suresh, S/o Late Kowthalam Chinna Ramaiah, Hindu, aged about 40 years, Agriculturist, R/o Goudagallu Vil., Kosigi Mandal, Kurnool Dist.
Whereas the above named Petitioners/Appellants filed a petition against you for condoning the delay of 664 days in filing the above Appeal.
You are hereby directed to appear before this Hon'ble Court on 23-07-2025 at 10.30 a.m. either in-person or through a Counsel. Failing which the matter will be decided in your absence.
By Order of the Court.
J.VENKATESULU,
ADVOCATE FOR THE PETITIONERS.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE, ALUR
E.P. No:- 17/2022 in OS No:- 41/2021
Between
Ramzan his G.P.A. holder Yerriswamy T ...DHR
V/s
P Shiva S/o. Mahendra Reddy. ...JDR
Auction Announcement Notice
In the above said E.P. the amount which has to come to DHR and the property relates to JDR, this property comes to Auction on 08/07/2025 at above mentioned Court and who are interested for the auction of the said property they have to attend the court at about:- 10:30 Am.
The landed property situated at T Sakibanda, Kurnool District, Alur Sub-District.
Item No:-1:- Sy No:- 13D, Extent :- Acres 15.50 cents part acres 2.75 cents.
SCHEDULE
The landed property situated at T Sakibanda Village, Kurnool District, Alur Sub-District, Andhra Pradesh.
Boundaries for Item No:- 1
East:- Land of Mahendra Reddy
West:- Land of Mahendra Reddy
North:- Land of T Eranna
South:- Road
The above sale is subject to mortgage.
DHR Value :- 6,60,000/- (Rs.2,40,000/1Acre)
Amin value :- 10,50,000/-
Market value:- 6,32,500/- (Rs.2,30,000/1Acre)
As per Court order
Auction Date:- 08/07/2025
Advocate for DHR
R Huliraj (Ballari)
Mob No:- 9886133724

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్, ఆదోని.
S.O.P.No. 03/2025
Between:
1. బూరుగుల నరసమ్మ, D/o late నరసన్న @ K. పెద్ద ఈరన్న,
2. కురువ అంజినయ్య S/o. late నరసన్న,
3. కురువ మల్లికార్జున S/o. late నరసన్న,
4. కురువ గోవిందు S/o. late నరసన్న,
5. కురువ మల్లయ్య S/o. late నరసన్న,
6. కురువ మాలమ్మ D/o. late నరసన్న,
అందరూ ఇంటి నెంబర్ 17/258/1, కల్లుబావి, ఆదోని, ...Petitioner
Regional Provident Fund Commissioner, Kadapa. ... Respondent
జనరల్ నోటీస్
మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్, ఆదోని నందు పై అర్జీదారులు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా పిటిషన్ నెంబర్ No.1 భర్త లేట్ నరసన్న @ K.పెద్ద ఈరన్న. Realer గా Kothari మిల్లు లో పనిచేస్తూ రిటైర్ అయినారు తరువాత దివాంగతులు అయినారు. సదరి మిల్లు యాజమాన్యం అతనికి రావలసిన EPF అమౌంట్ మరియు పెన్షన్ బకాయిలు వెరసి మొత్తం రూ.85,700/- వరకు రావలెను సదరు డబ్బు కొరకు భార్య అతని కుమారులు పై దావాను కోర్ట్ లో వేసి Succession సర్టిఫికేట్ కొరడమైనది. పై దావాలో ఇందులో ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న ఎడల స్వయంగా గాని వకీల్ ద్వారా గాని 26.06.2025 తేదీన ఉదయం 10:30 నిమిసాలకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేనిచో పరోక్షమున కోర్ట్ వారు ఈ ధావా తీర్మానం చేయుదురని ఇందు మూలముగ తెలియచేయడము అయినది.
(కోర్ట్ వారు ఉత్తర్వులు మేరకు)
వాయిదా తేదీ : 26.06 2025
H. నాగరాజు
పిటిషనర్ తరపున న్యాయవాది,
రెవెన్యూ బిల్డింగ్ కాంప్లెక్స్, ఆదోని
CELL : 9959739409

నాణ్యతగా బైపాస్ రోడ్డు నిర్మాణం

- త్వరలో పూర్తి

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రజల ట్రాఫిక్ కష్టాలు త్వరలోనే తీరనున్నాయని, హైవే బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. బుధవారం పట్టణ శివారులో జరుగుతున్న హైవే బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్పతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణ శివారులోని ఎమ్మిగనూరు రోడ్డు ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి ఆస్పరి రోడ్డు మీదుగా ఆలూరు రోడ్డులో మహాయోగి లక్ష్మమ్మ ఆర్చి సమీపంలో కలిసే విధంగా రూపకల్పన జరిగిందని తెలిపారు. రోడ్డు సుమారు 7.3 కిలోమీటర్ల పొడవు ఉందని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.242 కోట్లు మంజూరయ్యాయని, ఇందులో రోడ్డు నిర్మాణానికి రూ.98 కోట్లు, భూమి కొనుగోలు కోసం రూ.125 కోట్లు అయిందని చెప్పారు. ఈ రోడ్డు కోసం ప్రయివేట్ భూమి 54.8 ఎకరాలు కొనుగోలు చేసినట్లు, రూ.127 కోట్లు ఖర్చు అయినట్లు తెలిపారు. ఇందులో ప్రభుత్వ భూమి 24.6 ఎకరాలు అవసరం అయిందన్నారు. 70 శాతం రోడ్డు నిర్మాణం పూర్తయిందని, సంక్రాంతి లేదా ఉగాదిలోపు ఈ రోడ్డును ప్రజలకు అంకితం చేస్తామని తెలిపారు. రోడ్డు ప్రారంభంలో అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని చెప్పారు. వైసిపి నాయకులు వారికి అనుకూలంగా ఈ ప్రాజెక్టును వినియోగించుకొని అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. అక్రమాలను త్వరలోనే నిగ్గు తేల్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా రెండు కిలోమీటర్ల పొడవు రోడ్డు నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. త్వరలోనే పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. హైవే రోడ్డుకిరువైపులా మట్టి కోతకు గురికాకుండా, డ్రెయినేజీ కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిధుల ఇబ్బంది లేకుండా

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రత్యేకంగా మంత్రులను కలిసి మంజూరు చేయిస్తామన్నారు. కాంట్రాక్టర్ చంద్రశేఖర్, నాయకులు సింహం నాగేంద్ర, మధుసూదన్ శర్మ ఉన్నారు.

ప్రతి మహిళనూ లక్షాధికారిని చేయడమే లక్ష్యం

ప్రతి మహిళనూ లక్షాధికారిని చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. బుధవారం మెప్మా ఆర్‌పిలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్‌పిలు డేటా ఎక్కించడానికి ట్యాబ్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. ఆర్‌పిలు మరింత ఉత్సాహంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఆదోని ఎక్సైజ్ సిఐ సైదుల్

ప్రజాశక్తి - కౌతాళం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన సమాజం కోసం సహకరించాలని ఆదోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ కోరారు. బుధవారం

కౌతాళంలో మాట్లాడుతున్న సిఐ

కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. చిన్న వయస్సులోనే మత్తుకు అలవాటు పడడం వల్ల జ్ఞాపకశక్తి కోల్పోయి, నరాల బలహీనత ఏర్పడి అయోమయానికి గురై డిప్రెషన్‌లోకి వెళ్తారని తెలిపారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహనా సదస్సు నిర్వహించి విద్యార్థులకు వివరించాలని చెప్పారు. హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు సోముల సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, సుబ్రహ్మణ్యం శర్మ, శైలజ, వసీం నాజ్, సుధాకర్, రాగ వేణి, స్కూల్ కమిటీ ఛైర్మన్ సోదరుడు లింగేష్ ఉన్నారు. **కోసిగి**లోని మౌంట్ కార్మెల్ పాఠశాలలో ప్రిన్సిపల్ ఫాదర్ జాన్సన్, ఇన్‌ఛార్జీ కరస్పాండెంట్ ఫాదర్ థామస్ అధ్యక్షతన పాఠశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. కోసిగి ఎక్సైజ్ సిఐ భార్గవ్ రెడ్డి మాట్లాడారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాదకద్రవ్యాలు సేవిస్తూ పట్టుబడితే చట్టాలు, శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు.

'ఎత్తిపోతల' ప్రారంభానికి టెండర్

- వైసిపి రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి

- హర్షం వ్యక్తం చేసిన రైతులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గురు రాఘవేంద్ర ఎత్తిపోతల ప్రారంభానికి అధికారులు టెండర్ పిలిచినట్లు వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి తెలిపారు. ఎత్తిపోతల కింద రైతులకు నీరందించటానికి అధికారులు స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఎమ్మిగనూరులో మాట్లాడారు. నందవరం, ఎమ్మిగనూరు మండలాలకు సంబంధించిన గురు రాఘవేంద్ర ప్రాజెక్టులోని సాగునూరు, పులిచింత, చిలకలడోన స్కీమ్‌లకు మరమ్మతులు చేసి రైతులకు అందుబాటులో తీసుకురావాలని ఈనెల 19న వైసిపి ఆధ్వర్యంలో నందవరం, ఎమ్మిగనూరు మండలంలోని రైతులు, సర్పంచులు గురు రాఘవేంద్ర ఎత్తిపోతల కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. అధికారులు అందుబాటులో లేకపోయినా ఫోన్‌లో మాట్లాడినట్లు చెప్పారు. వారం రోజుల్లోపు టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. అధికారులు స్పందించి ఈనెల 21న ఎత్తిపోతల పథకం పనుల ప్రారంభానికి టెండర్ ప్రక్రియ మొదలుపెట్టి, 23 నుంచి జూన్ 30 వరకు ఈ టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. జులై 1న టెండర్ ఓపెన్ చేసి కాంట్రాక్టర్‌తో త్వరగా స్కీమ్‌లు మొదలు కావడానికి కావాల్సిన ట్రాన్స్‌ఫారాలు, మోటార్లు 15 రోజుల్లోపు మరమ్మతులు చేసి రైతులకు నీరందించే విధంగా చూడాలని అధికారులను కోరామన్నారు. మిట్టసోమాపురం సర్పంచి నరసింహులు, మాచాపురం నాయకులు కోటేశ్వరరావు, ఇబ్రహీంపురం సర్పంచి ప్రకాష్ రెడ్డి, ప్రచార విభాగం అధ్యక్షులు చాంద్ బాషా, ఎస్సీ సెల్ అధ్యక్షులు శాంతిరాజు, నందవరం చుక్కా మల్లేష్, కుల్లూరు శేషిరెడ్డి, కైరవాడి వెంకటేష్, చక్కెరప్ప, గోవిందు, నాయకులు ప్రభాకర్, సోమన్న, శివ, సుధాకర్, గోవిందు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

27న సిడిఎంఎ కార్యాలయం ముట్టడి

- మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు

ప్రజాశక్తి - ఆదోని

న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెట్టడం సమంజసం కాదని, ఉద్యమం తీవ్రతరం చేసే దిశగా ఈనెల 27న సిడిఎంఎ కార్యాలయం ముట్టడి చేపడతామని యూనియన్ నాయకులు పీరా సాహెబ్, సోమన్న, అహ్మద్ తెలిపారు. ఆదోని మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు వర్కర్స్ చేపట్టిన నిరసన దీక్ష బుధవారం 23వ రోజుకు చేరింది. కార్మికుల దీక్ష శిబిరానికి సిఐటియు నాయకులు లక్ష్మన్న, తిప్పన్న సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరసన సమ్మె 50వ రోజుకు చేరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమ్మెలో ఉన్నా ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం బాధాకరమని తెలిపారు. రాష్ట్ర యూనియన్ నాయకులు జెఎసిగా ఏర్పడి అన్ని సంఘాల నాయకులు 27న సిడిఎంఎ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఆదోని కార్మికులు కూడా సుమారు 30 మంది ఇక్కడి నుంచి బయల్దేరేందుకు సిద్ధమవుతున్నారని, అందుకు సిఐటియు సహకారం ఉంటుందని తెలిపారు. మిగతా నాయకులు, కార్మికులు ఆదోనిలో నిరసన దీక్ష కొనసాగిస్తారన్నారు.

మలేరియా నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు

- దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- పత్తికొండ సబ్ యూనిట్ మలేరియా నివారణ అధికారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - చిప్పగిరి

మలేరియా నివారణ కోసం ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పత్తికొండ సబ్ యూనిట్ మలేరియా నివారణ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం చిప్పగిరి ఎంపిపి పాఠశాలలో స్థానిక ఎఎన్ఎం శాంత కుమారి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జూన్ నుంచి మలేరియా, డెంగీ కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఈ వ్యాధులపై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధి లక్షణాలుంటే ప్రభుత్వాస్పత్రికి వెంటనే వెళ్లాలని తెలిపారు. అన్ని ప్రభుత్వాస్పత్రుల్లోనూ ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు

మలేరియా నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

అందజేస్తున్నామన్నారు. వైద్యాధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.

దోమల నుంచి రక్షణ అవసరం

ఇటీవల అక్కడక్కడ వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయని, దోమలు కాటు నుంచి రక్షణ పొందాలని మలేరియా నివారణాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... వైరల్ ఫీవర్ వస్తే మందులు వాడితే తగ్గిపోతుందని, జలుబు, తలనొప్పి, వాంతులు, ఒంటిపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. అజాగ్రత్తగా ఉంటే వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని, వ్యక్తిగత పరిసరాల శుభ్రతతో రోగాలను అధిగమించవచ్చని తెలిపారు.

ఘనంగా శ్రీశైలం తాత ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని ములుగుందం గ్రామంలో శ్రీశైలం తాత 14వ ఆరాధనోత్సవాలు వైభవంగా సాగాయి. బుధవారం తాత సమాధిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయం ప్రాంగణం కిటకిటలాడింది. తాత సమాధికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి పురవీధుల గుండా రథోత్సవం ముందుకు కదిలింది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామ పెద్దలు కృష్ణమూర్తి, మనోహర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, రామకృష్ణా రెడ్డి, చిన్నాయప్ప, రంగస్వామి, భీమన్న, నరసింహులు, దస్తగిరి పాల్గొన్నారు.

30న ఎపి భవన నిర్మాణ సంఘం మహాసభ

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని ఎపి భవన నిర్మాణ కార్మికుల ముడవ నగర మహాసభలు హరికిషన్ సింగ్ సుర్జిత్ భవన్‌లో ఈనెల 30న ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నామని నగర అధ్యక్ష ,కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, ఎస్ డి ఖాజా పాషా తెలిపారు. బుధవారం కర్నూలు సుజిత్ భవన్లో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకుల సమావేశంలోవారు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను అలాగే మెమో నెంబర్ 12, 14, ను రద్దు చేయాలన్నారు. జీవో నెంబర్ 17 ద్వారా గత ప్రభుత్వం తీసుకున్న నిధులను తిరిగి సంక్షేమ బోర్డులకు జమ చేసి, భవన నిర్మాణ కార్మికుల అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఈ మహాసభలలో చర్చించబోతున్నామని అన్నారు. నగరంలోని భవన నిర్మాణ కార్మికులందరికీ కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు.

క్షయ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్షయ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని నేషనల్ హెల్త్ మిషన్ అడిషనల్ సెక్రటరీ ఆరాధన పట్నాయక్ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లను కోరారు. బుధవారం న్యూఢిల్లీ నుండి ఆమె జిల్లా కలెక్టర్లతో ఇతర వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. టిబితో పాటు మధుమేహం, లివర్ ,కిడ్నీ వ్యాధి, హెచ్ఐవి , ఏ ఇతర వ్యాధితో బాధపడుతున్న వారిని ఆసుపత్రిలో చేర్పించి వారికి ప్రత్యేకమైన చికిత్స అందజేయాలని తెలిపారు. జిల్లా స్థాయి కాల్ సెంటర్ ద్వారా చికిత్స పూర్తయిన తర్వాత 2 సంవత్సరాల పాటు టిబి చరిత్ర ఉన్న వారందరినీ ఫాలో-అప్ చేయాలని కోరారు. టిబి వ్యాధి మరణాలను తగ్గించడానికి పోషకాహారం, మందులు అందించి వ్యాధి నివారణకు కృషి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లాలో ఉన్న దాదాపు 2500 మంది టిబి వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్స్ , సరియైన మందులు అందజేసే చర్యలు తీసుకోవాలని డిఎం అండ్ హెచ్ఒ శాంతికళ ను ఆదేశించారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

రైతు సేవ కేంద్రాలకు వెళ్లి సలహాలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ రైతులకు సూచించారు. కోడుమూరు మండలంలోని

గోరంట్ల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సిబ్బంది తరచుగా గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారు సాగు చేస్తున్న పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలపాలని వెల్లడించారు. గ్రామాల్లో రైతులు పత్తి, కంది, సజ్జలు, ఆముదాల పంటలను సాగు చేశారని, ఇప్పటికి ఇంకా పొగాకు, ఉల్లి సాగు చేయడానికి నేలను తయారు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది ప్రదీప్, రాజేష్, సర్పంచ నాయుడు, చింతమాను మాధవస్వామి, మనోహర్, భక్షాల గిడ్డయ్య, నాగార్జున పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన జోనల్ మేనేజర్

ప్రజాశక్తి- గూడూరు

గూడూరు నగర పంచాయతీలో ఉన్న అన్న క్యాంటీన్‌ను బుధవారం జోనల్ మేనేజర్ అనిల్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం చేపట్టిన అన్నక్యాంటీన్‌ను నిరుపేద ప్రజలకు తెలుగుదేశ ప్రభుత్వం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసిందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, రేమట వెంకటేష్, కోడుమూరు, శేషావలి, కొన్నిలం, బుడ్డంగిలి మాట్లాడుతూ విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదేశాల మేరకు అన్న క్యాంటీన్ కొత్త నిరుపేద సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ప్రతి ఒక్కరూ సద్విని చేసుకొని రాబోయే కాలంలో గూడూరు నగర పంచాయతీలో విష్ణు ఆదేశాల మేరకు ప్రతి టిడిపి కార్యకర్త ముందంజలో ఉంటారన్నారు. టిడిపికి అందంగా ఉండి రాబోయే ఎలక్షన్లలో గూడూరు నగర పంచాయతీలో టిడిపి జెండా ఎగరేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

డిఇఒకు డివైఎఫ్ఐ సూచన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ కార్యదర్శి నగేష్

జిల్లావ్యాప్తంగా కార్పొరేటు ప్రైవేటు పాఠశాలలు విచ్చలవిడిగా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి పుస్తకాల వ్యాపారం, అధిక ఫీజులు వసూలు, విద్య హక్కు చట్టాన్ని అమలు చేయకపోవడం లేదని డిఇఒ ప్రకటనలు ఇవ్వడం మాని చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు విద్యార్థి సంఘాలు రోజు డిఇఒ, కలెక్టర్, ఎంఇఒలకు విన్నవించుకుంటున్నా డిఇఒ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకుంటామని పేపర్ ప్రకటనలు ఇవ్వడం తప్ప వాటి మీద కఠిన చర్యలు తీసుకున్నది లేదని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర నగేష్ జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ బాష తెలిపారు. ప్రకటన మానేసి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విచ్చలవిడిగా ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల కంటే అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పాఠశాలలోనే పుస్తకాల వ్యాపారంగా మార్చేస్తున్నారని, విద్య హక్కు చట్టం ప్రకారం జాయిన్ అవుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుండి పుస్తకాలు, డిజిటల్ కంటెంట్, కరాటే తదితర పేర్లతో బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అనేకమార్లు విన్నవించుకుంటున్నా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసినా అధికారులు మాత్రం చర్యలు తీసుకుంటామని మాటలు తప్ప కఠినంగా కార్పొరేట్ ప్రవేట్ స్కూళ్లపై వ్యవహరించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం భారత పార్లమెంటు చేసిన చట్టాన్ని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించి యదేచ్ఛగా విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తుంటే ఎందుకని నోరు మూసుకొని కూర్చుందని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గాలిలో మేడలు కట్టే విధంగా విద్యా వ్యవస్థను చక్క దిద్దుతున్నామని మీడియా, సోషల్ మీడియాలో పోస్ట్‌లు తప్ప అడ్డగోలు గా నడుపుతున్న నారాయణ, భాష్యం, శ్రీ చైతన్య ఇతర ప్రవేట్ పాఠశాలలపై చర్యలు శూన్యమని తెలిపారు. ఈ కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం ఇసుమంత చిత్తశుద్ధి ఉన్నా వెంటనే నిబంధనలను ఉల్లంఘించిన కార్పొరేట్, ప్రవేట్ పాఠశాల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలుగుదేశం నాయకులే కార్పొరేట్ విద్యాసంస్థలను నడుపుతున్నారు. కాబట్టి ఇలా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని భావించాల్సి వస్తుందని తెలిపారు.

మద్దికెరలో టిబి ఎక్స్‌రే పరీక్షలు

ప్రజాశక్తి-మద్దికేర

టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మద్దికేర మండలంలో టిబి అనుమానాస్పదం కల వారికి సుమారు 65మందికి టిబి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాగిణి, డాక్టర్ శ్రీ లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమం మద్దికెర సర్పంచి బండారు సుహాసిని ప్రారంభించారు. బండారు సుహాసిని, డాక్టర్లు, రాగిణి, శ్రీలక్ష్మి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చమటలు పట్టడం, బరువు తగ్గిపోవడం, 60 ఏళ్లకు పైబడిన వారు, పొగ తాగేవారు, మద్యం సేవించేవారు, పౌష్టికాహార లోపం ఉన్నవారు, ఇంతకుముందు క్షయ వచ్చి పూర్తిగా నయమైన వారు, వారి కుటుంబ సభ్యులు, వారి ఇరుగుపొరుగు వారందరూ టిబి గల్ల పరీక్షలు , ఎక్రే పరీక్షలు చేయించుకొని టిబి ని దేశం నుండి పారద్రోలాలన్నారు. టిబి అంతం మన పంతం అని, టిబిహారేగా దేశ్ జీతేగా అంటూ నినాదాలు ఇస్తూ ఆరోగ్య విద్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్ బాబు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అక్బర్ బాషా, హెల్త్ సూపర్వైజర్లు కృష్ణమ్మ, సూర్యనారాయణ, టిబి సూపర్వైజర్ వీరన్న ,టిబి ల్యాబ్ సూపర్వైజర్స్ మమత, జీవిత, హెల్త్ ప్రొవైడర్లు అంజలి, మంజుల ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీ ,అంజలి సువర్ణ , ఆశా కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీసవేతనాలివ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీసవేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం బి.రాధాకృష్ణ అధ్యక్షతన ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ సమావేశం కార్మిక కర్షక భవన్‌లో ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఇఎస్ఐ లాంటి సౌకర్యాలు కల్పించడం లేదని, పని భద్రత ఉండడం లేదని విమర్శించారు. ప్రవేట్ సెక్యూరిటీ గార్డ్స్ సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందని, ప్రభుత్వ సంస్థలలోనూ ప్రవేట్ సంస్థలలోనూ ప్రవేట్ సెక్యూరిటీ గార్డ్స్‌ను ఉపయోగించుకోవడం పెరిగిపోయిందన్నారు. దానికి తగ్గట్టు వారికి తగిన సౌకర్యాలు కల్పించడంలో నిఫలమవుతున్నారని విమర్శించారు. రాబోవు కాలంలో సెక్యూరిటీ గార్డ్ సమస్యల పైన ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణ, మద్దిలేటి, చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన ప్రాంతాల్లో కూడళ్ళ ఏర్పాటుకు చర్యలు

త్వరలో విశ్వేశ్వరయ్య కూడలి కుదింపు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రధాన ప్రాంతాల్లో కూడళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. బుధవారం ఆయన మున్సిపల్, ఆర్ అండ్ బి శాఖల అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో కూడళ్ల ఏర్పాటుకు ప్రదేశాలను పరిశీలించారు. ఆనంద్ థియేటర్ వద్ద కిసాన్ ఘాట్- బంగారు పేట వెళ్లే రహదారిలో, కొత్త బస్టాండ్ సుందరయ్య కూడలి, వై.జంక్షన్ ప్రాంతాల్లో కూడళ్ళ ఏర్పాటుకు, గాయత్రి ఎస్టేట్ విశ్వేశ్వరయ్య సర్కిల్ కూడలి కుదింపునకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, డిఇఇ సాయిరాం, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జ్ ఎస్ఇ శేషసాయి, డిఇఇ గంగాధర్, ట్రైనీ ఎఇ ఖాసిం వలి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-పత్తికొండ

పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలకు ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలని పత్తికొండ మండల వ్యవసాయ అధికారి వెంకటరాముడు అన్నారు. బుధవారం పత్తికొండ మండల పరిధిలోని చక్రాల చందోలి గ్రామాలలో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తుంది అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ వెంకట రాముడు మాట్లాడుతూ పంట తెగుళ్లపై ప్రజలకు వివరించారు. పంట పొలాలలో పంట మార్పిడి చేసుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రియాజ్ బాషా, ఎపిఎంఐపి కాజా హుస్సేన్, విహెచ్ఎ, విఎఎ సునాయన, అలీమ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి రూ.70వేల విలువైన బాడీ ఫ్రీజర్ ను విరాళంగా ఇచ్చిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల దాతృత్వం

ప్రజాశక్తి- మద్దికేర

మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో 2003-2004 పదో తరగతి పూర్వ విద్యార్థులు దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామస్తులందరికీ రూ.70000 విలువచేసే బాడి ఫ్రీజర్ బాక్స్‌ను బుధవారం గ్రామపంచాయతీకి విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మృతి చెందితే రెండు మూడు రోజులు ఆలస్యమైతే ఇబ్బంది తలెత్తే అవకాశం ఉన్నందున ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందిస్తున్నామన్నారు. గ్రామస్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో గ్రామాభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామన్నారు. అనంతరం వారి ఉపాధ్యాయునికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి విజయుడు, కృష్ణారెడ్డి నాగార్జున, రాజకుమార్ ప్రసాద్, రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.